క్లుప్తంగా

రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో గణపతికి అలంకరణ



నవులూరు(మంగళగిరి): ఎంటీఎంసీ పరిధిలోని నవులూరు బత్తుల వారి వీధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని గురువారం రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా గణనాథుడు ధననాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. బాల యూత్ గణపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధననాథుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాదం స్వీకరించారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి



మంగళగిరి: శనివారం జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని టిప్పర్ల బజార్‌లోని కార్యాలయంలో సంబంధిత పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు అనుమతులు రద్దు చేసి ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో ఉపసంహకరణ కోసం విజయవాడలో మహా సభ నిర్వహించనున్నామని.. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మంగళగిరి కార్యదర్శి మున్నా, కమిటీ ప్రతినిధులు నరేష్, సురేష్, భాష, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఆస్పికాన్-2025 ఏడో వార్షిక సదస్సు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో గురువారం ఆస్పికాన్-2025 ఏడో వార్షిక సదస్సు నిర్వహించారు. ఎయిమ్స్ క్లినికల్ మైక్రో బయాలజీ జనరల్ మెడిసన్ ఫార్మకాలజీ విభాగాల ఆధ్వర్యంలో వర్క్ షాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ.. యాంటి బయాటిక్స్‌ను వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా తీసుకుని వాడడం వల్ల అనేక సమస్యలు వస్తాయన్నారు. వైద్యులు వ్యాధి నిర్ధారించిన అనంతరం కోర్సు ప్రకారం యాంటి బయాటిక్స్ వాడాలన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ సీఎఫ్ఎం హెచ్‌వోడీ డాక్టర్ రాజీవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌శక్తి సంకల్పంపై అవగాహన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో గురువారం విద్యార్థులకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి సంకల్పంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో అనురాధ మాట్లాడుతూ.. లింగ సమానత్వం గురించి వివరించారు. బాల్య వివాహాలు చేయకూడదని.. దాని ద్వారా పిల్లలు ఆరోగ్యం సరిగా ఉండదని చెప్పారు. ఒన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్టేటర్ శాంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు హెల్ప్‌లైన్ నెంబర్లు, చట్టాల గురించి వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయకూడదన్నారు. వాటిని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: స్కూల్ బస్సు ఢీకొని బాలిక తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలి మండలం చావావారిపాలెం వద్ద చోటు చేసుకుంది. పొన్నూరుకు చెందిన కుటుంబం పొలం పనుల కోసం వచ్చి చావావారిపాలెం వద్ద రోడ్డు వెంబడి నివసిస్తోంది. ఆర్నేళ్ల చిన్నారి మేఘమాల మంచినీళ్ల కోసమని రోడ్డు దాటుతుండగా అంగలకుదురుకు చెందిన ప్రైవేటు స్కూల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టిందని తల్లిదండ్రులు తెలిపారు. కాలికి తీవ్ర గాయం కావడంతో ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ యాజమాన్యం తమనే బెదిరిస్తున్నారని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు.

జ్వరాలతో మంచం పట్టిన నగరం

- విష జ్వరాలు, వైరల్ ఫీవర్‌ల రోగులతో నిండిన ఆసుపత్రులు
- ఆదుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీలు



డెంగీ జ్వరం బాధితుడి ఇంటి వద్ద పరీక్షలు నిర్వహిస్తున్న మలేరియా వైద్యబృందం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరం వైరల్ ఫీవర్, విష జ్వరాలతో మంచం పట్టింది. నగరంలోని ప్రతి ఇంటిలో జ్వరబాధితులున్నారు. ప్రభుత్వాసుపత్రికి గతంలో 100 నుంచి 150 మంది వచ్చేవారు. గత కొద్ది రోజులుగా జ్వరాలు పెరగడంతో ప్రతి రోజు 400 మందికి పైగా జ్వర బాధితులు చికిత్స కోసం ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలతో బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నగరంలో నిర్మించిన 9 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు ప్రస్తుతం జ్వర బాధితులకు అండగా నిలుస్తున్నాయి. దీంతో పేదలు వైద్యాన్ని అందుకోగలుగుతున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి..

ప్రతి రోజు ఒక్కో యూపీహెచ్‌సీకి గతంలో 40 మంది లోపే రోగులు వస్తుండేవారు. వాతావరణ మార్పులతో ప్రస్తుతం ఆ సంఖ్య 150 నుంచి 200 వరకు చేరిందని.. ప్రభుత్వ ఆసుపత్రిలోనే జ్వర బాధితులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జ్వరాలు మరింత విస్తరించకముందే ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు మేల్కొని మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి జ్వర బాధితులకు సరైన వైద్య సేవలు అందేలా చూడాలని పట్టణ వాసులు వేడుకుంటున్నారు.

నైపుణ్య శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి



శిక్షణ తరగతులలో పాల్గొన్న యువకులు

నీరుకొండ(మంగళగిరి): ఏపీసీఆర్‌డీఏ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో కలిసి రాజధాని యువత, మహిళల ఉపాధి పెంపొందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత నైపుణ్యా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. మండలంలోని నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం రాజధాని యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ శిబిరాన్ని సీఆర్‌డీఏ అధికారులు ప్రారంభించారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత రవాణా సౌకర్యం, భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణలో జీఎస్టీ అసిస్టెంట్, కంప్యూటర్ నెట్ వర్క్, స్టోరేజ్, డిజైన్ ఇంజినీర్, సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా అసిస్టెంట్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజస్టర్ చేసుకుని తరగతులకు హాజరుకావచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు లైవ్ లీవుడ్ స్పెషలిస్ట్ శంకర్ 98482 24207 నంబరులో సంప్రదించాలని కోరారు.

భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గొప్పది



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేరీ సువర్ణలత



ఉపాధ్యాయ వేషధారణలో విద్యార్థులు

తాడికొండ: భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గొప్పదని.. ఉపాధ్యాయ వృత్తికి అపారమైన గౌరవం తెచ్చిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మేరీసువర్ణలత అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురువులు తమ జ్ఞానంతో విద్యార్థుల అజ్ఞానాంధకారాన్ని తొలగించి సరైన మార్గం చూపించడంతో పాటు జీవితానికి అర్థాన్నిచ్చి దైవ సాన్నిధ్యానికి మార్గనిర్దేశం చేస్తారన్నారు. సర్వేపల్లి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని మంచి నడవడిక నడవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ గురువులను సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సునీత లక్ష్మీ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కారిక్రుడు.. సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు గురువు అని హెచ్ఎం యస్.శోభాదేవి అన్నారు. గురువారం దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు ఉపాధ్యాయ వేషధారణలో తరగతులు నిర్వహించారు. కార్యక్రమం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మనూరు జయరామ్‌ను పదవి నుంచి తొలగించాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిపై గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరి జయరామ్ చేసిన వ్యాఖ్యలకు గానూ.. ఆయనను వెంటనే పదవి నుంచి చంద్రబాబు తొలగించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభాకర్‌రెడ్డిపై జయరామ్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఉండవల్లి సెంటర్‌లో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గుంతకల్లు నియోజకవర్గంలో సోలార్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌కి భూసేకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభాకర్‌రెడ్డి రైతులకు అండగా నిలవడం తప్పు ఎలా అవుతుందని నిలదీశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, జొన్నా శివశంకర్, వీరాస్వామి, ఈశ్వరరెడ్డి, టి.బక్కిరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, ఈ.రామారావు, మస్తానరావు, సనకం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే వైద్యులను సంప్రదించండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు



వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

తెనాలిఅర్బన్: జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలలో చూపించుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు కాలనీలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యేసుబాబు మాట్లాడుతూ షుగర్, బీపీ, మలేరియా, టైఫాయిడ్ వంటి పరీక్షలను అర్బన్ హెల్త్ సెంటర్‌లలో చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ దోమకాటు వలన జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సరోజిని, ఏఎంఎన్‌లు, ఆశ కార్యకర్తలు, ల్యాబ్ టెక్నిషియన్లు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డు చైర్మన్‌గా తోట దుర్గాప్రసాద్



తెనాలి: తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి నామినేటెడ్ పదవుల కోసం కూటమి పార్టీలకు చెందిన నాయకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గురువారం ప్రకటించిన రాష్ట్రంలోని 18 మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో తెనాలితో సహా రెండు యార్డుల చైర్మన్ పదవులు జనసేనకు లభించాయి. తెనాలి యార్డు చైర్మన్‌గా పట్టణానికి చెందిన జనసేన యువనేత, బీసీ యాదవ వర్గీయుడైన తోట దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. పట్టణ నాజరుపేటకు చెందిన దుర్గాప్రసాద్ రైతుకుటుంబానికి చెందిన వారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం



తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషి స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షునిగా చిన్నం హరిగోపాల్, సభ్యులుగా జొన్నాదుల మదన్మోహన్‌రావు, ఆకురాతి శ్రీనివాసరావు, తాడిపర్తి శ్రీనివాసరావు, గుంటి ధనలక్ష్మి సభ్యులుగా ఏర్పాటైన నూతన పాలకవర్గం ప్రమా ణస్వీకారాన్ని దేవస్థానంలో చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శారదాదేవి హాజరయ్యారు. సంఘ పెద్ద శ్రేష్ఠులు, బహూత్తమ సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దుగ్గిరాల: చిలువూరు సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైను ఏర్పాటు కారణంగా 33, 11 కేవీ చిలువూరు ఏజీఎల్ ఫీడర్.. 11 కేవీ మరమ్మతుల వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గోపీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలువూరు, పెనుమూలి, కంఠంరాజుకొండూరు, అమ్మవారి టెంపుల్ ఏరియా గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఏఈ ఆ ప్రకటనలో కోరారు.

రైతులకు యూరియా అందేలా చర్యలు



దుగ్గిరాల: రైతులకు అందించేందుకు అన్ని రైతు సేవా కేంద్రాలు, సొసైటీలకు 1,243 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. గురువారం చిలువూరు గ్రామంలోని రైతులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో ప్రతి ఒక్క రైతుకూ యూరియా అందించేలా వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు దుగ్గిరాలలో వాటర్ ట్యాంకుకు భూమి పూజ

దుగ్గిరాల: దుగ్గిరాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా ట్యాంకు నిర్మాణం చేయనున్నారు. దీని కోసం శుక్రవారం భూమి పూజ నిర్వహించనున్నామని పంచాయతీ కార్యదర్శి వివేకానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: వ్యభిచార స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి బోస్‌రోడ్డులోని టౌన్ చర్చి ఎదురు రోడ్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు, సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వ్యభిచారం నిర్వహిస్తున్న నర్రా గోపి, షేక్ ఆసియాతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఏఏఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశం రేపు

తెనాలిరూరల్: అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్(ఏఏఎఫ్) 19వ రాష్ట్రస్థాయి సమావేశాన్ని శనివారం గుంటూరులో నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీధర్ గురువారం తెలిపారు. గుంటూరు గీతా రీజెన్సీలో జరిగే ఈ సమావేశంలో ఏఏఎఫ్ చైర్మన్ పినిపే రామకృష్ణ, ఏపీ స్టేట్‌బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్ పాల్గొంటారని, న్యాయవాదులు పాల్గొనాలని ఆయన కోరారు.

నాణ్యతలో తేడా రానివ్వకండి

తెనాలిఅర్బన్: నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ సూచించారు. 26వ వార్డు పాండు రంగపేటలోని పశువుల ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అయన వెంట డీఈ శ్రీనివాసులు, ఏఈ సూరిబాబు ఉన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొలనుకొండ స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 30 ఉంటుందని, రైల్లో నుంచి జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి. వెంకాద్రిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 72070 76614 నంబరులో సంప్రదించాలన్నారు.

బాబు పాలనలో మోసం గ్యారెంటీ

- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి
- మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ వేమారెడ్డి, హనుమంతరావు



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

మంగళగిరి/మంగళగిరి టౌన్: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పార్కురోడ్డు 30, 31వ వార్డులలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేమారెడ్డి తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ.. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులను గాలికి వదిలేసి కార్పొరేట్ల కంపెనీలకు దోచిపెట్టేపనిలో నిమగ్నమవుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, గౌరవ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, జిల్లా యాక్టివ్ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, పార్టీ వివిధ విభాగాల నాయకులు, కట్టెపోగు భూషణం, సయ్యద్ గౌస్, మాలిక్ బాబు, మాదల గోపి, జంగా నాగిరెడ్డి, ఎస్.లక్ష్మయ్య, కె.శ్రీను, కె.నరసింహరావు, ఈ.శ్రీనివాసరావు, మురళీ కుమార్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ అభినందనీయం..

తాడేపల్లి రూరల్: పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని దొంతిరెడ్డి వేమారెడ్డి కొనియాడారు. గురువారం తాడేపల్లి మహానాడు రోడ్డులో శ్రీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీని వేమారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గణేష్ సేవా సమితి ప్రతినిధులు తిరుము, నాగేశ్వరరావు, నాగేంద్ర, చందు, అశోక్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు మద్దతు



దీక్షలో పాల్గొన్న నాయకులు, ఏసీసీ కార్మికులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ కార్మికుల దీక్షకు వైఎస్సార్ సీపీ కార్మిక యూనియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు మద్దతుగా నిలవడం సంతోషకరమని ఏసీసీ సిమెంట్ కార్మికుల యూనియన్ నాయకులు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలని కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం 275వ రోజుకు చేరిందని అన్నారు. దీక్షలను సీఐటీయూ నాయకులు వి.దుర్గారావు, ఇ.నరసింహారావు, కార్మిక యూనియన్ నాయకులు కె.స్టీఫెన్, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, సూర్యప్రకాష్‌లు ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలిపారు. దీక్షలో దురెంగుల రమణమ్మ, దామవరపు సువర్ణకుమారి, వేము, రిబ్కా, మొలక, శారదా, ఉప్పు కాసమ్మలు కూర్చున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సుభాని, వై.సాంబశివరావు, వై.సుబ్బారావు, గురవయ్య, ఇస్మాయిల్, ఎస్.సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కంచర్ల శ్రీనివాసరావు

మంగళగిరి: గిడుగు రామ్మూర్తి ఆధునిక తెలుగు భాషా ఉద్యమ పితామహుడు అని ప్రముఖ తెలుగు సాహితీ కీర్తి భక్త రామదాసు 10వ తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని స్థానిక ఎస్ఎస్‌వీ ఇంటర్నేషనల్ స్కూలు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగు భాషను కన్నతల్లిలా కాపాడుకునే బాధ్యత వర్తమాన సమాజంతో పాటు విద్యాసంస్థలపై మాత్రమే ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కవిత్వ రచన, వృక్తత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, మేనేజర్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు త్వరలో సరిపడా ఎరువులు



మాట్లాడుతున్న తుళ్లూరు ఏవో సంధ్యారాణి

తాడికొండ: రైతు సేవా కేంద్రాలలోకి త్వరలో సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచనున్నట్లు తుళ్లూరు మండల వ్యవసాయాధికారిణి పి.సంధ్యారాణి అన్నారు. గురువారం తుళ్లూరు మండలం పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. మండలంలో 1,400 హెక్టార్లలో పత్తి, 80 హెక్టార్లలో వరి సాగు చేశారన్నారు. ఇందుకు గానూ 750 బస్తాల యూరియా అవసరం ఉందని.. ఇప్పటికే 50 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో మిగిలిన యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. రైతుల అవసరాల మేరకు మాత్రమే యూరియా తీసుకోవాలని, అధికంగా తీసుకొని స్టాక్ పెట్టుకోవడం వల్ల కొరత ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బోరునీటి వాడకంతో ఫ్లోరోసిస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గిరిధర్

ఫిరంగిపురం: బోరునీరు వాడడం ద్వారా ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, శిరంగిపాలెంలోని ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ.. జంకు ఫుడ్ తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పండ్లు, పాలు, ఆకుకూరలు, గుడ్లు వంటి పోషక విలువలతో కూడిన పదార్థాలు తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు అనూష, జి.సుజాత, ఏఎన్ఎంలు లావణ్య ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు దేవినర్సమ్మ, లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.